మాదిగల మద్దతు కూటమికే..

03

RNI: APTEL/26/A8235

అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

అక్షర దర్శిని

దినపత్రికలో పని చేయడానికి అనుభవం కలిగిన, జర్నలిజంపై ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను. కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

9912808090

8374168090

నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -30 | శుక్రవారం 30 అక్టోబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్మయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-

నెల్లూరు నగర అభివృద్ధికి బాటలు వేద్దాం

- వైసీపీ మేయర్ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డికి మద్దతివ్వండి
- 58, 68, 69వ డివిజన్లలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

నెల్లూరు,(అక్షర దర్శిని): నెల్లూరు నగర అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. నగరంలోని 58, 68, 69వ డివిజన్లలో శాసనమండలి సభ్యుడు, నెల్లూరు నగర వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్ అభ్యర్థులతో కలిసి బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మేయర్ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డికి నెల్లూరు నగరంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసిన కాకాణి.. ఆనం కుటుంబ వారసుడిగా ప్రజల ముందుకు వచ్చిన ఆయనకు నగర ప్రజలు ఆశీస్సులు అందించాలని కోరారు. 58వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి జమీర్ హుస్నా సిద్దికా, 68వ డివిజన్ అభ్యర్థి అరవ ప్రమీల, 69వ డివిజన్ అభ్యర్థి షేక్ మా భాషలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వాల పనితీరుపై ప్రజలు బేరీజు వేసుకోవాలి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గుర్తించాలని కాకాణి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలను పోల్చి చూసి ఓటర్లు తమ నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

ప్రశాంతమైన నగరానికి ప్రజాసేవ చేసే నాయకత్వం నెల్లూరు నగరంలో ప్రశాంత వాతావరణం కొనసాగాలంటే అభ్యర్థుల వ్యక్తిత్వం, కుటుంబ నేపథ్యం, ప్రజలకు సేవ చేసే విధానాన్ని పరిశీలించి ఓటు వేయాలని కాకాణి కోరారు. విద్యావంతులు, సామాన్య ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవించేందుకు అనువైన వాతావరణం ఉండాలని పేర్కొన్నారు. నగరంలో రౌడీయిజానికి తావులేకుండా ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందన్నారు.

పన్నుల వసూళ్లపై విమర్శలు పన్నుల వసూళ్ల పేరుతో సామాన్య ప్రజలపై భారం మోపుతున్నారని కాకాణి ఆరోపించారు. పన్నులు చెల్లించకపోతే విద్యుత్, తాగునీటి సరఫరా నిలిపివేస్తామంటూ పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన పాలకులు వసూళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలతో సమన్వయం చేసుకుంటూ అవినీతికి తావులేకుండా సేవలు అందిస్తామని కాకాణి పేర్కొన్నారు. మేయర్ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డితో పాటు పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

మంచి చేసే వారికే ఓటు వేయండి

- అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమి అభ్యర్థులను ఆశీర్వదించండి
- ముత్తుకూరు మండలంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు(అక్షర దర్శిని): స్థానిక సంస్థలను బలోపేతం చేసి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓటర్లను కోరారు. అభ్యర్థుల పనితీరు, గత పాలనలో వారు చేసిన పనులను పరిశీలించి ఓటు వేయాలని సూచించారు. ముత్తుకూరు మండలంలోని పిడతాపోలూరు, బ్రహ్మదేవం పంచాయతీల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబర్ 5న జరగనున్న నేపథ్యంలో, ఎన్నికలు వాయిదా పడటంతో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు మరో రెండు రోజుల సమయం లభించిందని సోమిరెడ్డి పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులు మంచి పనులు చేస్తున్నారని భావిస్తే సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. వైసీపీ పాలనలో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అవినీతి, అక్రమాలు, భూకబ్జాలపై ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కీలకమని సోమిరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్‌ఆర్ నిధులను కూడా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని చెప్పారు. రోడ్లు, సాగునీరు, విద్యుత్ తదితర రంగాల్లో వివిధ శాఖల ద్వారా నిధులు తీసుకొస్తున్నట్లు వివరించారు. 2018లో ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 70 వేల ఎకరాల సీజేఎఫ్‌ఎస్ భూములకు డీకేటీ పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారు 7 వేల మందికి డీకేటీ పట్టాలు అందించినట్లు పేర్కొన్నారు. పేద రైతులకు భూములపై యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా వారి ఆస్తుల విలువ పెరిగిందని చెప్పారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం బ్రహ్మదేవం జెన్‌కో రోడ్డు సెంటర్‌లో సెయిల్ సీఎస్‌ఆర్ నిధులతో సూపర్

స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ ప్రక్రియ ప్రారంభమైనట్లు సోమిరెడ్డి వెల్లడించారు. గత విద్యా సంవత్సరంలో విద్యార్థినులకు 1,800కు పైగా సైకిళ్లు అందించామని, ఈ ఏడాది మరో 2 వేల సైకిళ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీతో పాటు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, వాటర్ ప్లాంట్ల ఏర్పాటు చేపడుతున్నట్లు వివరించారు. గిరిజన కాలనీల అభివృద్ధికి కంపెనీల సహకారాన్ని తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి

మిగతా 4 లో.......

కూటమి ఓటమి భయంతోనే కుట్ర రాజకీయాలు

- ప్రజల్లో కూటమి పాలనపై తీవ్ర అసంతృప్తి
- స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కవు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత ధ్వజం
- మహమ్మదాపురంలో జోరుగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం

పొదలకూరు,(అక్షర దర్శిని): ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న వ్యతిరేకతను చూసి కూటమి ప్రభుత్వం ఓటమి భయంతో కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కే పరిస్థితి లేదని విమర్శించారు. పొదలకూరు మండలం మహమ్మదాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ అభ్యర్థి బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ అభ్యర్థి కృష్ణవేణమ్మతో కలిసి కాకాణి పూజిత ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కాకాణి పూజిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కూటమి నాయకులు ఓట్ల కోసం గ్రామాల్లోకి వెళ్తుంటే ప్రజల నుంచి తీవ్ర నిరసనలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో చీపుర్లు, చెప్పులతో నిరసనలు వ్యక్తమవుతున్నాయని వ్యాఖ్యానించారు.

ప్రజాబలం లేకనే కుట్రలకు తెరతీశారు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేకనే కూటమి నాయకులు కుట్ర రాజకీయాలకు తెరతీశారని కాకాణి పూజిత ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను గుర్తించిన కూటమి నాయకులు ఎన్నికలకు ముందే చేతులెత్తేసే పరిస్థితికి చేరుకున్నారని

మిగతా 4 లో.......

రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధికి రూ.7 లక్షల విరాళం

పొదలకూరులో రామాలయ శిఖర, మండప నిర్మాణాలకు శ్రీకారం

పొదలకూరు,(అక్షరదర్శిని): పట్టణంలోని శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత రామాలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఆలయ శిఖర నిర్మాణంతో పాటు మండప నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ నెల 30వ తేదీ ఉదయం 7 గంటలకు నిర్మాణ పనుల ప్రారంభానికి శుభ ముహూర్తం ఖరారు చేసినట్లు శ్రీరామ మందిర దేవస్థానం కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి పొదలకూరు గ్రామ ప్రజలు, శ్రీరామ భక్తులు, దాతలు కుటుంబ సమేతంగా హాజరుకావాలని కమిటీ కోరింది. ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు, దాతలు తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేసింది. గ్రామ ప్రజలందరి భాగస్వామ్యంతో ఆలయ నిర్మాణ పనులను విజయవంతంగా పూర్తి చేయాలని కమిటీ పిలుపునిచ్చింది.

పెనబద్వేల్‌లో టీడీపీలోకి 50 మంది యువకులు

▶▶ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరికలు

కలువాయి,(అక్షర దర్శిని): నెల్లూరు జిల్లా కలువాయి మండలం పెనబద్వేల్ గ్రామంలో తెలుగుదేశం పార్టీలోకి యువత చేరికలు జరిగాయి. గ్రామానికి చెందిన సుమారు 50 మంది యువకులు టీడీపీలో చేరారు. టీడీపీ ఇన్‌చార్జి మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా శివరెడ్డి, చింతంరెడ్డి రవితేజరెడ్డి పాల్గొన్నారు. పార్టీలో చేరిన యువకులకు నాయకులు సాదరంగా స్వాగతం పలికారు. యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు యువత సహకారం అవసరమని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు యువత కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సామాజిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనాలని కోరారు. పెనబద్వేల్ గ్రామానికి చెందిన సుమారు 50 మంది యువకులు టీడీపీలో చేరడంతో స్థానికంగా రాజకీయ సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి.. వాకాటి సంధ్య విజ్ఞప్తి

▶▶ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా వైసీపీ విస్తృత ప్రచారం

పొదలకూరు,(అక్షర దర్శిని): పొదలకూరు పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. బిట్--2 ఎంపీటీసీ అభ్యర్థి వాకాటి సంధ్యకు మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ఎంపీటీసీ అభ్యర్థి వాకాటి సంధ్య స్థానిక ఓటర్లను నేరుగా కలుస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలు, అవసరాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల్లో తనకు అవకాశం కల్పిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు జడ్పీటీసీ అభ్యర్థి బచ్చల సురేష్ కుమార్ రెడ్డి సైతం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పార్టీ శ్రేణులతో కలిసి ఓటర్లను కలుస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రచారాన్ని కొనసాగిస్తూ పార్టీ అభ్యర్థులకు మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. పొదలకూరు బిట్--2లో వైసీపీ ప్రచార కార్యక్రమాలతో ఎన్నికల సందడి నెలకొంది. ప్రతి ఓటరును కలవడం, పార్టీ అభ్యర్థుల గురించి వివరించడం, మద్దతు కోరడంపై నాయకులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎంపీటీసీగా వాకాటి సంధ్యను, జడ్పీటీసీగా బచ్చల సురేష్ కుమార్ రెడ్డిని గెలిపించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని వైసీపీ శ్రేణులు ఓటర్లను అభ్యర్థిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటూ ఓటర్ల మద్దతు కోసం కృషి చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో రెండు స్థానాల్లోనూ విజయం సాధించాలనే లక్ష్యంతో వైసీపీ

శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి.

కూటమి అభ్యర్థులను గెలిపించండి.. అభివృద్ధికి బాటలు వేయండి

▶▶ ఆర్ వై పాలెం ఎంపీటీసీ సెగ్మెంట్‌లో టీడీపీ సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రచారం

పొదలకూరు,(అక్షరదర్శిని): స్థానిక సంస్థల నుంచి రాష్ట్రం, కేంద్రం వరకు ఒకే ప్రభుత్వం , కూటమి ప్రభుత్వం ఉంటే గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందని టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పొదలకూరు మండలంలోని ఆర్వైపాలెం ఎంపీటీసీ సెగ్మెంట్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేస్తూ, వారి తరఫున మద్దతు కోరారు. ఎంపీటీసీ అభ్యర్థి మైలా.కోటేశ్వరరావు, జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల అమలు, ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరువ కావడంలో సమన్వయంతో కూడిన పాలన కీలకమని ఆయన పేర్కొన్నారు. ఆర్ వై పాలెం సెగ్మెంట్‌లో నిర్వహించిన ప్రచారంలో భాగంగా గ్రామస్తులను కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి మైలా. కోటేశ్వరరావు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల ఎన్నికలు స్థానిక అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తాయని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నది తమ లక్ష్యమని ప్రచారంలో వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్ బాబు, సీనియర్ నాయకుడు పులిపాటి వెంకటరత్న నాయుడు, సర్వేపల్లి జనసేన నాయకుడు నారదాసు రవి, కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, నల్లగంగు.వెంకటేశ్వర్లు రెడ్డి, పెంచల నాయుడు ఆవులపాటి.పిచ్చినాయుడు,నాగినేని పెంచల సిబ్బానాయుడు,నాగినేని.ప్రభాకర్ నాయుడు,కొప్పాల.రాఘవులు,మోహన్,గూడపాటి.కృష్ణమూర్తి, వేంకటరమణయ్య,అత్తెన.శ్రీనివాసులు,అడసనపల్లి.పెంచలయ్య యాదాల.కోటి,రాపూరు.రత్నం,పంతగిరి.పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాపూరు బిట్-2లో వైఎస్సార్‌సీపీ ప్రచారం జోరు

▶▶ ఎంపీటీసీ అభ్యర్థి మేరీగా సుమతికి మద్దతుగా డాక్టర్ రేవంత్ చక్రవర్తి ఇంటింటి ప్రచారం

రాపూరు,(అక్షర దర్శిని): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు జిల్లా రాపూరు పట్టణంలోని బిట్-2లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. బిట్-2 ఎంపీటీసీ అభ్యర్థి మేరీగా సుమతికి మద్దతుగా నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు డాక్టర్ మేరుగా రేవంత్ చక్రవర్తి ఇంటింటి ప్రచారం చేపట్టారు. స్థానికులను కలిసి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రేవంత్ చక్రవర్తి మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుత ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకుని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రచారంలో భాగంగా స్థానిక ప్రాంతాల్లోని డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల పరిస్థితిని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనించి, ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. బిట్-2 ఎంపీటీసీ అభ్యర్థి మేరీగా సుమతిని గెలిపించి ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగ ప్రకాష్‌రెడ్డి, డాక్టర్ ఖాదర్ బాషా, దమాయి, పార్టీ మండల కార్యదర్శి దాసరి వెంకటరమణయ్య, మాతంగి మోషే, దాసరి మోషే, దాసరి సైలేష్ బాబు, మేరీగా సతీష్, మేరీగా నితీష్, దమాయి కన్నప్ప తదితరులు పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని నిర్వహించారు.

పొదలకూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విస్తృత ప్రచారం

▶▶ ప్రజల ఆదరణే బలం.. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యమంటూ ఇంటింటా ప్రచారం

పొదలకూరు,(అక్షర దర్శిని): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొదలకూరు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బిట్--1 ఎంపీటీసీ అభ్యర్థి గంగవరపు లక్ష్మి కళ్యాణి, బిట్--2 ఎంపీటీసీ అభ్యర్థి వాకాటి సంధ్య, బిట్--3 ఎంపీటీసీ అభ్యర్థి కోవూరు వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ అభ్యర్థి బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను కలుసుకుంటున్నారు. గడపగడపకూ వెళ్లి ప్రజలతో మమేకమవుతూ తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు.ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అమలైన సంక్షేమ పథకాలు, విద్యా, వైద్య రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. పేద కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు, రైతులు, మహిళలు, విద్యార్థుల కోసం అమలు చేసిన పథకాలను ప్రస్తావిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, ప్రజలకు అందుబాటులో ఉండి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇస్తున్నారు.

కాకాణి నాయకత్వంపై విశ్వాసం

సర్వేపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అభ్యర్థులు ప్రజలకు వివరిస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యమిస్తామని చెబుతున్నారు.ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి అవసరాలను తెలుసుకోవడమే ప్రచార ప్రధాన ఉద్దేశమని అభ్యర్థులు పేర్కొన్నారు. ప్రజల ఆదరణ, పార్టీ శ్రేణుల సహకారంతో ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. బిట్--1, బిట్--2, బిట్--3 ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానంలోనూ తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు. ప్రచార కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత బీసీ బాబు ఇంట్లో విషాదం

▶▶ ఉమా మహేశ్వరి హఠాన్మరణం.. మంత్రి నారాయణ,మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ నివాళులు

నెల్లూరు,(అక్షర దర్శిని):టీడీపీ సీనియర్ నాయకుడు బీసీ బాబు కుటుంబంలో విషాదం నెలకొంది. ఆయన సతీమణి ఉమా మహేశ్వరి హఠాత్తుగా మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.ఉమా మహేశ్వరి మరణవార్త తెలుసుకున్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ,మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ బీసీ బాబు నివాసానికి చేరుకున్నారు. ఉమా మహేశ్వరి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రి నారాయణ, మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.బీసీ బాబు సతీమణి మృతితో ఆయన కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉమా మహేశ్వరి మృతి పట్ల పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

మాదిగల మద్దతు కూటమికే..

▶▶ రూప్ కుమార్ యాదవ్ విజయానికి సమష్టి కృషి!

▶▶ నెల్లూరు అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలి

▶▶ ఆత్మీయ సదస్సులో ఎంపీ వేమిరెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పిలుపు

నెల్లూరు,(అక్షర దర్శిని):నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రానున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పిలుపునిచ్చారు.మేయర్ అభ్యర్థి పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్‌తో పాటు డివిజన్లలో పోటీ చేస్తున్న కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నెల్లూరులోని జీపీఆర్ కళ్యాణ మండపంలో మాదిగల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మేయర్ అభ్యర్థి పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్‌తో కలిసి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నగరంలో మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. నగరం మరింత అభివృద్ధి చెందాలంటే స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు అవసరమని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు.మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్‌తో పాటు అన్ని డివిజన్లలోని కూటమి కార్పొరేటర్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. మాదిగ సామాజిక వర్గం సహా అన్ని వర్గాల ప్రజల మద్దతుతో నెల్లూరు నగర అభివృద్ధికి బాటలు వేయాలని ఆకాంక్షించారు.

రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధికి రూ.7 లక్షల విరాళం

▶▶ దాత రుద్రపాటి వెంకటేశ్వర్లు నాయుడును అభినందించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు,(అక్షర దర్శిని): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధి పనులకు దాత రుద్రపాటి వెంకటేశ్వర్లు నాయుడు రూ.7 లక్షల విరాళాన్ని అందజేశారు. గురువారం నెల్లూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు చెక్కు రూపంలో ఈ విరాళాన్ని అందించారు.క్యాన్సర్ ఆసుపత్రిలో అవసరమైన అభివృద్ధి పనుల కోసం ఈ మొత్తాన్ని వినియోగించాలని దాత కోరారు. అలాగే, విరాళం అందించిన తమ కుటుంబ సభ్యుల పేర్లతో ఆసుపత్రి ప్రాంగణంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.నరుకూరు సమీపంలో రైస్ మిల్లు నిర్వహిస్తున్న రుద్రపాటి వెంకటేశ్వర్లు నాయుడు సామాజిక సేవా దృక్పథంతో క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధికి రూ.7 లక్షలు అందించడం అభినందనీయమని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, రెడ్‌క్రాస్ సభ్యుడు యలమూరి రంగయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి జలాల్ చికిత్సకు దాతల సాయం కావాలి

▶▶ బ్రెయిన్ సంబంధిత సమస్యతో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడు

▶▶ నెల్లూరులో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలింపు

కలువాయి,(అక్షర దర్శిని):చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన 13 ఏళ్ల బాలుడు జలాల్ బ్రెయిన్ సంబంధిత సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. నెల్లూరు జిల్లా కలువాయికి చెందిన ఈ చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు కుటుంబ సభ్యులు చెన్నైకి తరలించారు. అయితే చికిత్సకు ఆర్థిక సహాయం అవసరం కావడంతో దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని సహాయం కోరుతున్నవారు విజ్ఞప్తి చేస్తున్నారు.చదువుకుంటూ, ఆటపాటలతో సంతోషంగా గడపాల్సిన వయసులో జలాల్ అనారోగ్య సమస్యతో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. తండ్రిని కోల్పోవడంతో ప్రస్తుతం తన అవ్వ ఇంట్లో ఉంటున్న ఈ బాలుడికి అనారోగ్యం మరింత కష్టాలను తెచ్చిపెట్టింది. తొలుత నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించగా, మెరుగైన వైద్యం కోసం ప్రస్తుతం చెన్నైకి తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యుల తరఫున సహాయం కోరుతున్నవారు తెలిపారు.

దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలి

చిన్నారి ఆరోగ్యం మెరుగుపడి తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని కుటుంబ సభ్యులు ఆశిస్తున్నారు. ఈ కష్ట సమయంలో చికిత్స ఖర్చులకు ఆర్థికంగా అండగా నిలవాలని దాతలు, స్వచ్ఛంద సంస్థలు, సేవాభావం కలిగిన వ్యక్తులకు విజ్ఞప్తి చేస్తున్నారు. తమకు తోచినంత సాయం అందించి బాలుడి వైద్యానికి తోడ్పడాలని కోరుతున్నారు.ఒక్కొక్కరు అందించే చిన్న మొత్తమైనా చికిత్స ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ఉపయోగపడుతుందని సహాయం కోరుతున్నవారు పేర్కొంటున్నారు. ఈ సమాచారాన్ని ఇతరులకు చేరవేసి మరింతమంది దాతలు ముందుకొచ్చేలా సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్థిక సహాయం అందించదలచిన వారు సంప్రదించాల్సిన నంబర్లు:

- 9666310642
- 96763 72869

తండ్రిని కోల్పోయి, అనారోగ్యంతో పోరాడుతున్న చిన్నారి జలాల్‌కు అండగా నిలిచి, మెరుగైన వైద్యం పొందేందుకు తమ వంతు సహకారం అందించాలని కలువాయి ప్రాంత ప్రజలకు, దాతలకు సహాయం కోరుతున్నవారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మంచి చేసే వారికే ఓటు వేయండి

మొదటి పేజీ తరువాయి

విషయంలో ఎవరు కృషి చేస్తున్నారు, ఎవరు ప్రజలకు నష్టం కలిగించారనే అంశాలను పరిశీలించి ఓటర్లు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

కూటమి అభ్యర్థులకు మద్దతు కోరుతూ.. పిడతాపోలూరు, బ్రహ్మదేవం పంచాయతీల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని సోమిరెడ్డి ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ అభ్యర్థిగా నీలం ప్రవీణ, పిడతాపోలూరు–1 ఎంపీటీసీ అభ్యర్థిగా నాగిరెడ్డి కొండారెడ్డి, పిడతాపోలూరు–2 అభ్యర్థిగా పేట ద్రాక్షాయణి, బ్రహ్మదేవం–1 అభ్యర్థిగా దాసరి శ్రీనివాసులు, బ్రహ్మదేవం–2 అభ్యర్థిగా పెడకాల వెంకమ్మకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కూటమి ఓటమి భయంతోనే కుట్ర రాజకీయాలు

మొదటి పేజీ తరువాయి

ఎద్దేవా చేశారు. అధికార బలంతో ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల తీర్పును మార్చలేరని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి నాయకత్వంలో సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పూజిత పిలుపునిచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పొదలకూరు మండల జడ్పీటీసీ అభ్యర్థి బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డితో పాటు మహమ్మదాపురం ఎంపీటీసీ అభ్యర్థి కృష్ణవేణమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు స్థానిక ఎన్నికల ఫలితాలతో గట్టి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

బిరదవోలులో జోరుగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



- కాకాణి ఆశీస్సులతో వైసీపీ జెండా ఎగరేస్తాం
- బిరదవోలు వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి ముడి. రమను అత్యధిక మెజార్టీతో గెలిపించండి..
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రావుల దశరథ రామయ్య గౌడ్
- సర్వేపల్లిలో వైసీపీ జెండా ఎగరేయడమే లక్ష్యం
- సర్వేపల్లి ఐటీ వింగ్ అధ్యక్షుడు రావుల ఇంద్రసేన గౌడ్

పొదలకూరు,(అక్షర దర్శిని): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొదలకూరు మండలంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. మండలంలోని బ్రాహ్మణపల్లి, బిరదవోలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రావుల దశరథ రామయ్య గౌడ్, సర్వేపల్లి నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు రావుల ఇంద్రసేన గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బిరదవోలు ఎంపీటీసీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ముడి రమను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

కాకాణి నాయకత్వంలో విజయమే లక్ష్యం: దశరథ రామయ్య గౌడ్

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రావుల దశరథ రామయ్య గౌడ్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆశీస్సులతో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, పేదల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందాయని, గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశామని గుర్తుచేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. బిరదవోలు ఎంపీటీసీ అభ్యర్థి ముడి రమను భారీ మెజార్టీతో గెలిపించి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి విజయాన్ని కానుకగా అందించాలని పిలుపునిచ్చారు.

సర్వేపల్లిలో వైసీపీ జెండా ఎగరేస్తాం: ఇంద్రసేన గౌడ్

సర్వేపల్లి నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు రావుల ఇంద్రసేన గౌడ్ మాట్లాడుతూ.. సర్వేపల్లి నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి విజయాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే తమ అభ్యర్థుల విజయానికి బాటలు వేస్తాయన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బిరదవోలు ఎంపీటీసీ అభ్యర్థి ముడి రమను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం బ్రాహ్మణపల్లి, బిరదవోలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు, (అక్షర దర్శిని) : జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. గురువారం ఉదయం నెల్లూరు నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను కూడా ప్రకటించినట్లు తెలిపారు. నవంబర్ 1వ తేదీన మున్సిపల్ ఎన్నికల పోలింగ్, నవంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు వేగంగా పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే నవంబర్ 5వ తేదీన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోలింగ్, నవంబర్ 7వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోందని వెల్లడించారు. ఎన్నికల నిర్వహణలో జిల్లా స్థాయి అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారని, రాత్రింబవళ్లు కష్టపడి తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్న అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు వివరించారు. నవంబర్ 1వ తేదీన జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరిక నేపథ్యంలో, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ అనూష, మున్సిపల్ కమిషనర్ నందన్, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.